www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 7 అక్టోబర్ 2023
5
అన్నమయ్య



ఎపిలో విచ్చలవిడిగా మానవ వనరుల దోపిడీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో విచ్చలవిడిగా మానవ వనరుల దోపిడీ జరుగుతోందని టిడిపి యువ నాయకులు దొమ్మలపాటి యశ్వశ్విరాజ్ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 23వ రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మద్యం, ఇసుక, ఇళ్ల స్థలాల మాఫియాతో అక్రమాలు, అరాచకాలు సాగిస్తూ రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టి అధోగతి చేశారని ఆరోపించారు. ఒక్కఛాన్స్ అని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి, నియంత పాలన సాగిస్తూ ఎదురు తిరిగిన ప్రజలు, ప్రతిపక్ష నేతలపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు, ప్రతిపక్ష నాయకులు అన్నింటికీ ఎదురు నిలబడి వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుదంతో జగన్మోహన్‌రెడ్డిని తరిమి తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి వెంకటేష్, నాయకులు మోడెం సిద్దప్ప, భవానీ ప్రసాద్, యర్రబల్లి వెంకట రమణా రెడ్డి, దేవరింటి శ్రీనివాసులు, బొమ్మిశెట్టి పురుషోత్తం, టిఎన్ఎస్ఎఫ్ ప్రభాకర్, సుబ్రహ్మణ్యం రెడ్డి, రమణ బెస్త, కదిరి రాజ్ కుమార్,సికిందర్,కాశీ శ్రీరామ్ వాల్మీకి, పసుపులేటి శ్రీనివాసులు, కత్తి లక్ష్మన్న, చంద్ర శేఖర్, మేకల రెడ్డి శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్లులు రావు.. భవనాలు పూర్తి కావు..!

- నత్తనడకన డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణం
- 91లో 4 మాత్రమే పూర్తి



కె.వి.పల్లి మండలం వగళ్లలో నత్తనడకన సాగుతున్న డిజిటల్ గ్రంథాలయం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అన్ని రకాల సేవలు ఒకేచోట అందించాలనే లక్ష్యంతో డిజిటల్ గ్రంథాలయాలను మంజూరు చేసింది. వాటికి సంబంధించిన నిర్మాణ పనులు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. నిధుల లేమి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో, కొన్ని చోట్ల స్థలాల సేకరణ, కోర్టు, వివిధ రకాల కారణాల వల్ల పాల కేంద్రాలు భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి.

జిల్లాలో 91 డిజిటల్ గ్రంథాలయ భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు భవనాలు మాత్రమే పూర్తి చేశారు. 45 భవనాలకు కనీసం పునాదులు కూడా తీయలేదు. డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణ పనుల బాధ్యతను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించారు. 2022వ సంవత్సరంలో ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షల చొప్పున జిల్లాలో 91 భవనాలను మంజూరు చేశారు. తరువాత టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించారు. జిల్లాలో 45 చోట్ల భూమి వాదాలు, కోర్టు, కాంట్రాక్టు ముందుకు రాక పోవడం వంటి కారణాలతో పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 21 డిజిటల్ గ్రంథాలయాలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు మొదలుపెట్టినవి 10, మట్టి తీసినవి 7, పునాదులు 7, గోడలు 0, స్లాబ్ 0, పూతల 0, పూర్తయినవి 0, మదనపల్లి నియోజకవర్గంలో 4 మంజూరు కాగా 4 పనులు మొదలు పెట్టలేదు. పీలేరు నియోజకవర్గంలో 20 మంజూరు కాగా 7, ఇంతవరకు మొదలు పెట్టినవి 7, మట్టి తీసినవి 9, పునాదులు 2,పూర్తి చేసినవి 2, రాయచోటి నియోజకవర్గంలో 13 మంజూరు కాగా, మొదలు పెట్టినవి 5, మట్టి తీసినవి 2, పునాదులు 2, గోడలు ఒకటి, పూర్తయినవి ఒకటి మాత్రమే ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గంలో 12 మంజూరు గాక ఇంతవరకు మొదలుపెట్టినవి 9, పునాదులు ఒకటి మాత్రమే చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో 21 మంజూరు కాగా ఇంతవరకు మొదలుపెట్టినవి 10, మట్టి తీసినవి 2, పునాదులు ఒకటి, గోడలు ఒకటి, పూర్తయినవి ఒకటి మాత్రమే చేశారు. మిగిలినవి వివిధ దశ లలో నిలిచి పోయాయి. ఇప్పటి వరకు 4 శాతం మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన 96 శాతం పూర్తి కావాలంటే ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందోనని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు కూడా సకాలంలో బిల్లు రాలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. 2024 సంవత్సరం చివరికి 100 శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం పేర్కొంటుంది. సకాలంలో డిజిటల్ గ్రంథాలయాల భవనాలు పూర్తి స్థాయిలో అవుతాయో లేదో వేచిచూడాల్సిందే.

నిర్మాణ పనులు వేగవంతం చేస్తాం



జిల్లాలో డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ పనులను 2024 సంవత్సరానికి పూర్తి చేయడానికి వేగవంతం చేస్తున్నాం. మండల ఇంజినీర్లతో ప్రతివారం సమీక్షించి సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం బిల్లు సకాలంలో కూడా అందుతున్నాయి. డిసెంబర్ చివరి నాటికి నాటికి వంద శాతం భవన నిర్మాణాలను పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుకున్నాం.

-ఎం.దయాకర్‌రెడ్డి, పిఆర్ఎస్ఇ, రాయచోటి.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం

- మండల స్థాయి స్పందనలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-పెద్దతిప్పసముద్రం (బి.కొత్తకోట)

జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రజా వినతుల తక్షణ పరిష్కానికి చూపాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దతిప్పసముద్రం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో జిల్లా కలెక్టర్ గిరీష అధ్యక్షతన మండల స్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒ మురళి, ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలన్ని నిర్లక్ష్యం చేయకుండా అక్కడికక్కడే పరిష్కరించి ప్రజలలో సంతృప్తి స్థాయి పెంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడం జరుగు తోందన్నారు. గ్రామాలలో ఉన్న చిన్నచిన్న సమస్యలన్నీ కూడా పరిష్కరించాలనే ఉద్దేశంతో మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం ఇక్కడికి రావడం జరిగిందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజా శ్రేయస్సుకు కృషి చేయడం జరుగుతోందన్నారు. ప్రతి పథకం అర్హులకు అందాలన్నదే ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యమని, అర్హులైన లబ్ధిదారులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఏ ఒక్కరూ లబ్ధి అందలేదనే విమర్శలు రాకూడదని అధికారులకు తెలిపారు. మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులందరూ ఇక్కడికి రావడం జరిగిందని మీ సమస్యలన్ని అర్జీ రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలని ప్రజలను కోరారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని రంగసముద్రం గ్రామానికి చెందిన ఎస్.నాగయ్య తనకు వృద్ధాప్య పెన్షన్ వస్తు నిలిపి వేయడం జరిగిందని తిరిగి తనకు పెన్షన్ పునరుద్ధరించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. బూర్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయించాలని, మడుమూరుకు చెందిన కే.లీలావతి తమ పొలానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, తుమ్మరకుంటకు చెందిన మల్లేష్ తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయించాలని అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పిం చారు. సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, తహాశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, జడ్‌టిసి శివయ్య, సర్పంచ్ శంకరప్ప, సర్పంచ్ నాగరత్న భాస్కర్ నాయుడు, విద్యుత్ శాఖ ఎఇ ఉత్తన్న, బి.కొత్తకోట శాఖ ఎఇ గిరిధర్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ భాష, సోషల్ మీడియా మండల కన్వీనర్ పవన్, వైసిపి నాయకులు సద్దాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



స్పందనలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

విద్యుత్ భారాలు తగ్గించాలని ఆందోళనలు : వామపక్షాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాయి. శుక్రవారం మదనపల్లెలోని సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు టి.హరిశర్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు, నాయకులు టి.కృష్ణప్ప, సాంబశివ, సురేష్ కుమార్, దేవ, తిరుమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలు, కరువు, ఉద్యోగుల ఆందోళనలు తదితర అంశాలను వామపక్ష పార్టీలు చర్చించి పోరాటాలకు కార్యాచరణను రూపొందించాయి. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు కొనసాగింపుగా ఈ నెల 9 నుంచి 15 వరకు కరపత్రాలను పంపిణీ చేయాలని, కాలనీలు, వీధుల్లో సమావేశాలు, ప్రజా బ్యాలెట్‌లు నిర్వహించి ప్రజల వ్యతిరేకతను కూడగట్టాలని, విద్యుత్ భారాలపై అన్ని మండలాల్లో వామపక్షాలు సమావేశమై పోరాటాలకు కార్యాచరణను రూపొందించాలని, 15న అన్ని మండలాల్లో నిరసన ధర్నాలు చేపట్టాలని నిర్ణయించాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై, దేశవ్యాప్తంగా మీడియా సంస్థలపై సోదాల పేరుతో ఎన్ఐఎ జరిపిన దాడులను సమావేశం ఖండించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసును క్రమబద్ధీకరించాలని సమావేశం డిమాండ్ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

ఇవిఎంల తనిఖీలో రాజకీయ పార్టీలు పాల్గొనాలి : గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల మూడో వారంలో జరిగే ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెక్ (ఎఫ్ఎల్‌సి) కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ గిరీశ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్‌సి ప్రక్రియ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజకీయ పార్టీలకు కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈవిఎంల పనితీరుకు సంబంధించి ఎఫ్ఎల్‌సి చాలా ముఖ్యమైన అంశం సదరు కార్యక్రమం నిర్వహించే సమయంలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం ఎంతో కీలకం కాబట్టి ఆయా పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొన్నాల్సి ఉందన్నారు. ఎఫ్ఎల్‌సికి సంబంధించి ఎలక్షన్ కమిషన్ నుంచి షెడ్యూల్ రాగానే రాజకీయ పార్టీలకు సమాచారం ఇస్తాం జిల్లాకు అందిన 3950 సియులు 4910 బియులు, 4850 వివి ప్యాట్‌లు మొత్తంగా 13710 ఇవిఎంల స్కాన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. బియు, సియులకు యాక్సెప్టెన్సీ టెస్ట్ కూడా పూర్తి చేశామన్నారు. 670 వివి ప్యాట్‌లకు యాక్సెప్టెన్సీ టెస్ట్ పూర్తయిందని మిగిలిన వాటి ప్రక్రియ కొనసాగుతోందని 11వ తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఆ సందర్భంగా ఇవిఎంలకు సంబంధించి రాజకీయ పార్టీలకు ఏవైనా సందేహాలు ఉన్నా సంబంధిత బెల్ ఇంజనీరింగ్ అధికారులు నివృత్తి చేస్తామన్నారు. జిల్లాలో నిర్వహించే ఎఫ్ఎల్‌సి విధానాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా ఎలక్షన్ కమిషన్ కూడా ప్రత్యక్షంగా పరిశీలిస్తుందని చెప్పారు. జిల్లాలో కొత్తగా 31 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని, 88 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు, 92 పోలింగ్ స్టేషన్లకు పేరు మార్చుటకు, మెర్జింగ్ అండ్ డిలీషన్లో భాగంగా ఒక పోలీస్ స్టేషన్‌ను ఎలక్షన్ కమిషన్ కు ప్రతిపాదించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహాశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడి డాక్టర్ విజయభాస్కర్‌రావు

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పశువులకు ఆయా కాలాలలో వచ్చే వ్యాధుల నుంచి సంరక్షించుకునేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ విజయభాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఆకేపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం నందు పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గొర్రెలు, మేకల యజమానులను పిలిపించి పశువుల పెంపకం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయభాస్కరరావు మాట్లాడుతూ జీవాలలో ప్రస్తుతం ఏ ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. జీవాలలో వచ్చే పిపిఆర్, నీలి నాలుక, బొబ్బ, చిటుక వ్యాధి వంటివి రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయని, పశు యజమానులు వీటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డివార్మింగ్ ఇప్పించాలని అన్నారు. సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ మాట్లాడుతూ గొర్రెల పెంపకం దారులు ఒక గ్రూపుగా ఏర్పడాలని సూచించారు. గ్రూపులో కనీసం 15 మంది సభ్యులు ఉండాలని, ఒక రెవెన్యూ గ్రామానికి ఒక గ్రూపును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. 1962 నెంబర్ కు ఫోన్ చేసి పశువులకు అంబులెన్స్ సేవలు పొందవచ్చునని పేర్కొన్నారు. పశువుల మేతకై దానామృతం సబ్సిడీ ద్వారా కిలో రూ.6.50 పైసలకు అందుబాటులో ఉందని, గొర్రెల పెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి, రాజంపేట పశువైద్యశాల జెవిఒ ఎం.వరదయ్య, ఆకేపాడు పశు వైద్య సహాయకులు కుమారి, పూజా ప్రియాంక, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె బెసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ అగర్వాల్స్ దృష్టి నయనధామ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనందరెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో విద్యార్థులతోపాటు పట్టణ వాసులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 138 మంది విద్యార్థులు, పట్టణ వాసులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్స్ దృష్టి నయనధామ ఆస్పత్రి మేనేజర్ జి.జగదీష్ బాబు, మార్కెటింగ్ మేనేజర్ ఇమ్మానుయేల్ రాజ్, ఆప్టోమెట్రిస్ట్ పల్లవి క్యాంపుకు విచ్చేసి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్, ఇన్సూరెన్స్ సౌకర్యం కలదని పేర్కొన్నారు. కంటి రెటీనా వైద్యం చేయడానికి తమ ఆసుపత్రిలో ప్రత్యేక సౌకర్యం కలదని, అందుకోసం ప్రతి రెండవ మరియు నాలుగవ సోమవారం రెండు గంటల నుండి రెటీనా పరీక్షలు నిర్వహిస్తారని మేనేజర్ జగదీశ్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీదేవి, డాక్టర్ సి.ఎస్.శైలజ, డాక్టర్ జి.చిన్నారెడ్డి, డాక్టర్ డి.శ్రీనివాసులు, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది ఆసుపత్రి సిబ్బందికి సహకరించారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ వార్డెన్ సంపూర్ణ 10 సంవత్సరాల నుంచి ఒకే హాస్టల్లో విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యతలేని భోజనాన్ని అందిస్తున్నారని, అంతర్జాలంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా చూపుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్, జూలై, ఆగస్టు నెలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నా నెల ఆఖరిలో మాన్యువల్ ఒకరోజు విజయవాడ నుంచి అవకాశం ఇచ్చినప్పుడు విద్యార్థులందరూ వచ్చారని హాజరు వేసుకొని లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఖజానాను వార్డెన్ తప్పుడు బిల్లులు చేసుకొని అధికారులను మోసం చేశారని పేర్కొన్నారు. తక్షణం జూన్, జూలై, ఆగస్టు బిల్లులను క్షుణ్ణంగా పరిశీలన చేసి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐగా కోరుతున్నామన్నారు. హాస్టల్లో వర్కర్లు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వారి పేర్లు పొందుపరచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ విధంగా అవినీతి చేస్తున్న సంపూర్ణను మరొక హాస్టల్‌కు ఇన్‌ఛార్జిగా నియమించి అధికారులు కూడా అవినీతిని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. తక్షణం ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తొలగించి సంపూర్ణపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, జిల్లా సహాయ కార్యదర్శి ఉపేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్ధన్, సురేష్, హరి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి స్వగ్రామైన నందలూరు మండలం చెన్నయ్యగారిపల్లెలో కొత్తగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డికి శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్రాయుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ తాము గత నాలుగు సమావేశాల్లో చెన్నయ్యగారిపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. ప్రస్తుతం ఈడిగపల్లె, పూసలకాలనీ, బాలకృష్ణాపురం తదితర గ్రామాల వారు చెన్నయ్యగారిపల్లె మీదుగా ఎర్రచెరువులోపల్లెలో ఏర్పాటు చేసిన 85, 86 పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వారి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఓటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని గ్రామాలకు మధ్యస్థ కేంద్ర ఐన ఎమ్మెల్యే స్వగ్రామైన చెన్నయ్యగారిపల్లిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం ఈ నెల 9వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలు నూతనంగా ఏర్పాటు చేసేందుకు, మార్పుకు గడువు ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి వారికి అనుకూలంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.



ఆర్‌డిఒతో చర్చిస్తున్న బత్యాల చెంగల్రాయుడు



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ వినయ్

'మిట్స్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిట్స్ కళాశాలలో మూడు రోజుల పాటు ఇంట్రడక్టరీ యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఔరంగాబాద్‌లోని మహారాష్ట్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, రిసోర్సు పర్సన్ డాక్టర్ వినయ్ చిద్రి మాట్లాడుతూ మానవుని యొక్క అంతిమ లక్ష్యం సంతోషంగా, ఐశ్వర్య వంతంగా ఉండడం కానీ మనం ఈ విషయాన్ని మర్చిపోయి వివిధ రకాల కార్యక్రమాలను శ్రమతోటి భౌతిక అవసరాల కోసం తాపత్రయ పడుతూ ఉంటామని పేర్కొన్నారు. జంతువులకు భౌతిక అవసరాలు మాత్రమే సరిపోతాయి కానీ మనుషులకు భౌతిక సదుపాయాలు తోపాటుగా గౌరవ మర్యాదలు కూడా కావాలి. సరైన అవగాహన తోటి మాత్రమే సాధ్యమవుతుందన్నారు. సరైన అవగాహన అనేది మనిషి యొక్క అవసరాల్లో భౌతిక అవసరాలనేటివి పాక్షికం, తాత్కాలికమన్నారు. కార్యక్రమంలో పులివెందుల జెఎన్‌టియు ప్రొఫెసర్ డాక్టర్ కె.శేష మహేశ్వరమ్మ, ప్రొఫెసర్ రఘునాథ్, పుత్తూరు సిద్ధార్థ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ చిత్రి తోటి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, కో-ఆర్డినేటోర్ డాక్టర్ జగదీష్ బాబు, డాక్టర్ చంద్ర మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు సిబ్బంది స్వీటీ

'వెలుగు'లో మస్తిష్క పక్షవాత దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్ళబైలు పంచాయతీ, అమ్మచెరువు మిట్టలోని వెలుగు సంస్థలో మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ (డిడిఆర్ఎస్), నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు మస్తిష్క పక్షవాతం డే (సెరిబ్రాల్ పల్సీ డే) కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనా కుమారిని వెలుగు సిబ్బంది స్వీటీ పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది ఎం.స్వీటీ మాట్లాడుతూ డీడీఆర్ఎస్ మరియు నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు మస్తిష్క పక్షవాతం డే (సెరిబ్రాల్ పల్సీ డే)ను వెలుగు ప్రత్యేక పాఠశాలలో జరుపుకుంటున్నామనీ, ఇది మెదడుకు సంబందించిందనీ సెరిబ్రాల్ అంటే మెదడు అనీ, పల్సే అంటే కండరాల బలహీనత అని తెలియ జేశారు. అనంతరం వెలుగు సిబ్బంది,స్పెషల్ ఎడ్యుకేటర్ విజయ కుమారి మాట్లాడుతూ సెరెబ్రాల్ పల్సే అనేది పిల్లలలో అభివృద్ధి చెందకుండా ఉండే మెదడు వల్ల సంభవించేదని, ఇది నరాల మరియు కండరాల కదలికలకు సంబంధించినదని తెలియజేశారు. ఈ లక్షణాలు సెరెబ్రాల్ పల్సే కలిగిన పిల్లల శరీరంలో భాగాలలో ఎక్కువగా చేతులకు, కాళ్లకు సోకుతుందని, ఈ మస్తిష్క పక్షవాతం వ్యాధి కలిగిన పిల్లలకు పూర్తిగా నయం కాకపోవచ్చు, కానీ ఈ మస్తిష్క పక్షవాతం కొంతవరకు నయం కావడానికి ఫిజియో థెరపీ, ఒకేషనల్ థెరపీ, ఆక్యుపెషనల్ థెరపీల ద్వారా నయం కావచ్చునని వివరించారు. అనంతరం వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సెరెబ్రాల్ పల్సే అనేది మెదడుకు, వెన్నుముకకు సంబందించినదని, ఈ వ్యాధి కలిగిన పిల్లలు నిరుత్సాహ పడకూడదని, తాను కూడా ఏదైనా చేయగలని అనే దృఢ సంకల్పం ఉండాలని, అందరి పిల్లలతో సమానంగా కలిసి ఉత్సహంగా పాల్గొనాలని తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మీ, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, వెలుగు సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యానికి పాల్పడితే వాహనాలు సీజ్ : సిఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ద్విచక్ర వాహనదారులు పెద్దగా శబ్దం వచ్చేలా సైలెన్సర్లను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామని పట్టణ సిఐ నరసింహారావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో విపరీత ధ్వనులు చేస్తూ ద్విచక్ర వాహనాలపై హల్‌చల్ చేస్తున్న మోటారు సైకిళ్లను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లను రోడ్డు రోలర్ కింద వేసి తొక్కించారు. ఈ సందర్భంగా సిఐ నరసింహారావు మాట్లాడుతూ యువత పెద్ద ధ్వనులు చేస్తూ ద్విచక్ర వాహనాలపై హల్‌చల్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శబ్ద కాలుష్యానికి గురి చేసే సైలెన్సర్లను వాహనాలకు వినియోగిస్తే యజమానులపై కేసు నమోదు చేసి బైకులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

మరమ్మతుకు నోచని తాగునీటి పైప్‌లైన్

ప్రజాశక్తి- చిట్వేలి

మండల పరిధిలోని మైలపల్లె పంచాయతీ బట్టువారిపల్లి సమీపంలో తాగునీటి పైపు పగిలి నీరు వృథాగా పోతున్నా రెండు నెలలుగా మరమ్మతులు చేయించే వారే లేరని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజ్ కారణంగా నీరంతా రోడ్లపై చేరి మడుగును తలపిస్తోందని అన్నారు. రోడ్డుపై వాహనదారుల కూడా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వాహనదారుల ఇబ్బందులనున గుర్తించి ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు కానీ, పైపు లీకేజీ మాత్రం అలాగే వదిలేశారు. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు మార్గంలో తిరుగుతుండడంతో గుంటలో వచ్చే నీరు కలుషితమై తిరిగి తాగునీటి పైపులో కలుస్తూ ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లీకేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం చెబుతున్నారు.చిన్నపాటి పైపులైన్ లీకేజ్‌ని మరమ్మతులు చేసేందుకు నెలల తరబడి సమయం తీసుకోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని కలుషిత నీరు తాగి రోగాల బారిన పడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఓటర్ల జాబితాలోని తప్పలను సరిచేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీ పరిధిలో ఉన్న ముప్పై విభాగాల ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరిచేయాలని సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరి చేయడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.తప్పులున్న ఓటర్ల జాబితాల ప్రతులను చేత పట్టుకుని,నగర పంచాయతీ పరిధిలో ఒకే కుటుంబ సభ్యులందరూ ఒకే బూతులో ఓటు వేసుకునే సదుపాయం కల్పించాలని, పట్టణంలోని 30 విభాగాలలో గందరగోళంగా ఉన్న ఓటర్ల జాబితాలను యుద్ధ ప్రాతిపదికన సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యస్.తంబయ్యశెట్టి, పి.నారాయణస్వామి, ఎస్.శంషుద్దీన్, డి.చిన్న రెడ్డెప్ప, జి.గంగులప్ప, దుమ్ముబాబు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో విద్యుత్ మరమ్మతుల పనుల కారణంగా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇఇ మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంటపంపల్లి 33కెవి ఫీడర్‌లో నల్లతిమ్మయ్యగారిపల్లె సబ్ స్టేషన్ నుంచి చింతకాయలపల్లె సబ్ స్టేషన్ వరకు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్లతిమ్మాయపల్లి నుంచి పొత్తపి వరకు ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని దీనిని ప్రజలు గమనించాలని కోరారు.



కలకడ : అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపిపి

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

ప్రజాశక్తి-నందలూరు

స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని షాదీఖానాలో: సర్పంచ్ మోడపోతుల సుభాషిని అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సౌభాగ్యమ్మ మాట్లాడుతూ ప్రతి పేదవారికి ఆరోగ్యాన్ని అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. కార్యక్ర మంలో ప్రభుత్వ వైద్యాధికారి సృజన, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనా రాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, ఉప సర్పంచ్ ఇబ్బు, మాజీ సర్పంచ్ సుభాన్, మోడపోతుల రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని కోన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్ చేతుల మీదుగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో హిమోగ్లోబిన్, బిపి, యూరిన్ పరీక్షలు, మలేరియా, డెంగీ పరీక్షలు, చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బికె చైర్మన్ హరినాథరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు సరళ, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, హెచ్‌ఎం చంగల్‌రాయుడు, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారులు మల్లికార్జునరావు, జవహర్, మోహన్ పాల్గొన్నారు. **రామాపురం :** ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ హైదర్‌వలి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కోటి భారతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి, వైద్యాధికారి విజయ్ కుమార్, వినయ్ కుమార్. పంచాయతీ కార్యదర్శులు. వీఆర్వోలు. ప్రజలు నాయకులు పాల్గొన్నారు. **గాలివీడు :** కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి ఆశయమని వైస్ ఎంపిపి1 మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. గోరాన్ చెరువు సచివాలయం నందు సర్పంచ్ దీప్తి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్‌నాయక్, వైఎస్ ఎంపిపి2 గాలి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి చిన్నారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటాద్రి, వెంకటశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ వైద్యులు హేమంత్‌కుమార్, మహాదేవ శంకర నాయక్, రాధా, మాధవి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి ప్రజాప్రతినిధులు,అధికారులు స్పష్టం చేశారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తట్టివారిపల్లి పంచాయతీ నందు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల కు పలు రకాల జబ్బులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై ప్రజలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేమారెడ్డి మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్య సంరక్ష ణకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు మూడు వేలకు పైగా జబ్బులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథు లుగా మదనపల్లి మండల స్పెషల్‌ఆఫీసర్ ధనలక్ష్మి, మార్కెట్‌యార్డ్ కమిటీడైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, తట్టివారిపల్లి సర్పంచ్ దీపా వేమారెడ్డి, ఎంపి టిసి, ఎంపిడిఒ, భాను ప్రసాద్, సచివా లయం స్పెషల్ ఆఫీసర్, ఆర్ డబ్ల్యూఎస్ ఎఇపిఎస్ రవీంద్ర నాయక్ మరియు డాక్టర్లు పర్వీన్ ఖాన్, ఝాన్సీలక్ష్మి, నేత్ర వైద్య నిపుణులు, డాక్టర్ వినయ్ (ఆర్థో),డాక్టర్ జరీనా (డిజిఒ),ప్రజలు పాల్గొ న్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై క్షేత్రస్థాయిలో సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన మెలకువలు సూచించాలని ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు, వ్యవసాయశాఖ ఎడి జయరాణి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎఒ రమేష్ బాబురావు, ఉప సర్పంచ్ రాజారెడ్డిలతో కలిసి నిర్వహించిన సంకల్ప సత్తహ్ కృషి మహోత్సవానికి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు ను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బిందు,తుంపర సేద్యం పరికరాలను పరిశీలించి అర్హులైన రైతులకు సబ్సిడీ ద్వారా త్వరితన అందించే విధంగా చూడాలని ఉద్యాన శాఖ అధికారిని నాగమణికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు క్షేత్రస్థాయిలో రైతులకు వివరిస్తూ ఎప్పటికప్పుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా పంటలు సాగు చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు అందజేస్తుందన్న విషయాన్ని కూడా తెలియజే యాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు బిందు సేద్యం ఎంత ఉపయోగమో తెలపాలన్నారు. ఎడి ఎ.సువర్ణ లక్ష్మి మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు ఈనెల తొమ్మిది లోపు ఇక్రాఫ్ చేయించుకోవడంతోపాటు ఇకెవైసి తప్పక చేయించుకునేలా రైతులకు సూచించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ఎక్కువ శాతం వేరుశెనగ పంటను రైతులు సాగు చేసుకోలేకపోయారని ప్రస్తుతం ఆయా గ్రామ సచివాలయాలలో 80 శాతం సబ్సిడీతో ఉలవలు అందుబాటులో ఉన్నందున ఉలవలు ను రైతులకు పంపిణీ చేసి పంటలు సాగు చేసుకోనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి దస్తగిరి, శంకర్‌నాయుడు, లక్ష్మీనారాయణ, సర్పంచులు జనార్ధన్‌రెడ్డి, కల్యాణి ప్రభాకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు చాన్‌బాషా, జాకీర్, వెంకట్రామిరెడ్డి, చిన్న వెంకటరమణ, సూరం వెంకటరామిరెడ్డి, రాజ రెడ్డి, బాబు, రామచంద్రయ్య, విహెచ్‌ఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాంతమ్మ, సరస్వతి పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న ఎంపిపి

ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలి : ఆర్‌డిఒ



ఇ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ రంగస్వామి

ప్రజాశక్తి-రామాపురం

ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుచేసిన ప్రతి రైతు పొలాలలో సిబ్బంది పంట నమోదు చేయాలని ఆర్‌డిఒ రంగస్వామి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి, బండపల్లి, గ్రామాల్లో సాగుచేసిన వరి పంటల క్రాప్ బుకింగ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో1327 ఎకరాలలో వరి పంట రైతులు సాగు చేశారన్నారు. అన్ని గ్రామాలలో ఇప్పటికే పంటనమోదు పూరయిందన్నారు. మిగిలిన రైతులు ఎవరైనా ఉంటే సిబ్బందితో సంప్రదించి పంటనమోదు చేయించుకోవాలన్నారు. క్రాప్ బుకింగ్ చేయించుకుంటే ప్రభుత్వ నుంచి వచ్చే సంక్షేమం పథకాలు వర్తిసాయని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరవింద కిషోర్, విఆర్ఒలు విగ్నేష్, అమీర్‌బాషా, గ్రామ సర్వేర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని నాలుగో సచివాలయం నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పరిశీలించారు. సచివాలయ నిర్మాణ నాణ్యతలో ఎక్కడ రాజీపడకుండా అద్భుతంగా నిర్మిసున్నారని కితాబునిచ్చారు. నాలుగో సచివాలయం నిర్మాణం పక్కనున్న జిల్లా పరిషత్ విశ్రాంతి భవనం పరిశీలించారు. 2013 నుంచి ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో జిల్లా పరిషత్ విశ్రాంతిభవనం పూర్తిగా దెబ్బతినడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆస్తులు నిరుపయోగంగా ఉండకూడదనే ఉద్దేశంతో మరమ్మతులకు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి మరమ్మతులు చేయించి భవనాన్ని ఉపయోగంలోకి వచ్చే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నియోజకవర్గంలో చాలావరకు సచివాలయ నిర్మాణాలు పూర్తయిపోయాయని, మిగిలిన సచివాలయాలను నిర్దేశిత గడవులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గం వైసిపి పరిశీలకులు ఖలీల్ అహ్మద్, పట్టణ వైసిపి కన్వీనర్ సి.ఆర్.చిన్ని కృష్ణ, వైసిపి నాయకులు ఎం.వి కిట్టన్న, జయ భారత్ రెడ్డి, సాయిచరణ్, సద్దాం వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక నాయకులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

రైతులకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న పంజం సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రైతు సలహా మండలి చైర్మన్ పంజం కుమార్‌రెడ్డి అన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ డెవలప్మెంట్ ప్రోగ్రాం లో బాగంగా కృషి మహోత్సవం వ్యవసాయ, అనుబంధ శాఖలచే నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, మైక్రో ఇరిగేషన్, ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో రైతుల సందర్శన నిమిత్తం స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పరిస్థితి మెరుగుదలకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ఎడి కవిత రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి జి.సుధాకర్ ఆస్పిరేషనల్ బ్లాక్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో రైతుల స్థితిగతుల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎఫ్‌బిఒ ఏర్పాటు వల్ల ఉపయోగాలు, భూసార పరీక్ష వల్ల ఉపయోగాలు, పిఎంకిసాన్, రైతులు లబ్ధికి రైతులు తీసు కొన వలసిన చర్యలను, చిరుధాన్యాలు అవశ్యకతను, డ్రోన్ టెక్నాలజీ గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ వెంకటరెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు పి.రత్నమ్మ, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సురేష్, వెటర్నరీ డాక్టర్ నాగ శిరిష, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, శ్రీరాములు, వ్యవసాయ సిబ్బంది, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-చిట్వేలి

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు, ఎన్‌సిసి అధికారిగా పనిచేస్తున్న పసుపుల రాజశేఖర్ జోనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. గురువారం జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అన్నమయ్య ,కడప జిల్లాల కలెక్టర్లు గిరీష, విజయ్‌రామరాజు సమక్షంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినందుకు గాను తమను ప్రభుత్వం గుర్తించి ఈ అవార్డు అందించడం హర్షణీయమన్నారు. వృత్తి పట్ల మరింత బాధ్యతగా, ఉత్సాహంగా పనిచేయుటకు అవార్డు తోడ్పడుతుందన్నారు. అవార్డు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజశేఖర్‌ను అభినందించారు. **నిమ్మనపల్లి :** నిమ్మనపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (తెలుగు)లో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కే.సహదేవరెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా అధికారులు ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్‌అలీఖాన్ తెలిపారు. ఇటీవల అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. **తంబళ్లపల్లి :** గ్రామీణ ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా స్పెషలిస్ట్ వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎంపిపి అనసూయమ్మ తెలిపారు. కుక్కరాజుపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రామరాజు సింగల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు నారాయణ, నరసింహారెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు. **కె.వి.పల్లె :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిశంకర్‌రెడ్డి ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎంపికైన జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రశంసా పత్రం అందుకున్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవార్డు గ్రహీత డాక్టర్ సాయిశంకర్‌రెడ్డిని సహచరాధ్యాపకులు శాలువాలాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.



చిట్వేలి : అవార్డు అందుకున్న రాజశేఖర్

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీరంగి జడ్‌పిహెచ్‌ఎస్ బి.కొట్టకోట మండలంలో జరిగిన తంళ్లపల్లె నియోజకవర్గస్థాయి ఖోఖో, త్రో బాల్ ఎంపికలో అండర్-17 విభాగంలో ఖోఖోలో బి. రెడ్డిప్ప నాయక్, కె.జగపతినాయక్ అండర్-14 విభాగంలో బి.చంద్రనాయక్ ఎంపిక య్యారు. త్రోబాల్ అండర్-17లో బి.రెడ్డప్ప నాయక్, అండర్-14లో బి.నిరంజన్ నాయక్, ఎం. ప్రవీణ్‌నాయక్ ఎంపికయ్యారు. ఈనెల 9, 10 తేదీలలో శ్రీకాళహస్తిలో జరుగు జిల్లాస్థాయి క్రీడలలో పాల్గొంటున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. **కంభం వారిపల్లి :** తిరుపతిలోని ఎస్‌పిజెఎన్‌ఎమ్ హైస్కూల్‌లో 67వ ఎస్‌జిఎఫ్ ఆటల పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఆటల పోటీలలో గ్యారంపల్లి గురుకుల కళాశాల విద్యా ర్థులు ఐదుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సంపాదించారు. త్రోబాల్‌లో ఎస్.ఇబ్రహీం, బాల్ బ్యాడ్మింటన్‌లో వి.సుధీర్ కుమార్, బి.శశివర్ధన్, టెన్నికా యిట్‌లో సి.ప్రభాస్, ఎస్.పవన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ డాక్టర్. ఎం. చెన్నకేశవులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులను అభినందించారు.



తంబళ్లపల్లి : జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సిసి యూనిట్ సిఒ అజయ్

ఎన్‌సిసి శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థులు ఎన్‌సిసి శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఎన్‌సిసి కేంద్రం సిఒ అజయ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా మంజూరైన ఎన్‌సిసి శిక్షణ కేంద్రాన్ని పాఠశాల ప్రిన్సిపల్ అంజాద్‌అలీఖాన్, సిటిఒ వెంకటగోపాల్‌లతో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల ప్రధానోపాధ్యాయులు కృషి ఫలితంగా నిమ్మనపల్లి మండలంలో మొట్టమొదటిసారిగా ఎన్‌సిసి శిక్షణా కేంద్రాన్ని పాఠశాలకు మంజూరు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఈ శిక్షణా కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద మందికి పైగా విద్యార్థులను ఎన్‌సిసి శిక్షణకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరందరికీ త్వరలోనే ఎన్‌సిసి అధికారులు, సిటిఒ ఉపాధ్యాయులు ప్రత్యేక క్యాంపులను నిర్వహించి ప్రతిరోజు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్‌సిసి ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు శారీరక సౌష్టవంతో పాటు, భవిష్యత్తులో ఉపయోగపడే శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందించడం జరుగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులు ఈ సదవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్, ఉపాధ్యాయులు వెంకటగోపాల్, ఎన్‌సిసి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

విద్యార్థులకు చదువుతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ ఎన్ఎండి రఫీ సూచించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గల రాజు స్కూల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి పట్టణంలో తిరిగే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్న వయసులో వాహనాలను నడపకూడదని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవడమే కాకుండా మీ తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఆయా పాఠశాలల్లో పిల్లలకు చదువుతోపాటు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగాధరించాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని అలా ఇస్తే తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు చేయాల్సి వస్తోందన్నారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించకుండా ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని అలా నడిపితే చట్టపరంగా శిక్షార్హులవుతారని వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎఎస్ఐ జోసెఫ్, ట్రాఫిక్ పోలీసులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

బురుజుమాదిగపల్లి పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని బురుజుమాదిగపల్లె ప్రాథమిక పాఠశాలను శుక్రవారం డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణను, పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల హాజరును తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుని పై వచ్చిన ఆరోపణలపై విద్యార్థులను, తల్లిదండ్రులను, స్థానికులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బురుజుమాదిగ పల్లె ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయ పాఠశాల గా నడుస్తుందని, ఉపాధ్యాయుడు సక్రమంగా పాఠశాలకు హాజరవుతున్నారని, ఆయన పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.



ఉపాధ్యాయులతో మహమ్మద్ సిరాజ్

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు కన్నెమడుగు పాఠశాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నెమడుగు జడ్‌పి హైస్కూల్లో గత సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థి మహమ్మద్ సిరాజ్ తయారు చేసిన మ్యాన్‌హోల్ క్లీనింగ్ డివైస్ ఇన్‌స్పైర్ మనక్‌లో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఎన్నికై జాతీయస్థాయికి ఎన్నికైంది. మ్యాన్‌హోల్‌లో దిగి కార్మికులు పనిచేయడం వలన వారి ఆరోగ్యం దెబ్బతినడం, మ్యాన్‌హోల్ శుభ్రం చేయడం ఇబ్బందికరంగా ఉండడం గమనించిన మహమ్మద్ సిరాజ్ ఒక పరిష్కారాన్ని కనుగొనే ఉద్దేశంతో కార్మికులు మ్యాన్‌హోల్‌లోకి దిగకుండా బయట నుంచే శుభ్రం చేసే మ్యాన్‌హోల్ క్లీనింగ్ డివైస్‌ను తయారు చేశాడు. ఈ పరికరాన్ని గైడ్ టీచర్ లక్ష్మీ నరసింహశాస్త్రి. రమణమ్మ ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.గణేష్ సహకారాలతో ఈ ప్రాజెక్టును తయారు చేశానని మహమ్మద్ సిరాజ్ తెలిపాడు. ఈ నెలలో 9,10,11 తేదీలలో జరిగే జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలలో పాల్గొనబోతున్న తెలిపాడు. విద్యార్థి సిరాజ్‌ను ప్రధానోపాధ్యాయులు ఎస్.మదన్మోహన్ అభినందించారు.



బస్టాండ్ ఆవరణంలో నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ సమస్యతో అవస్థలు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతుంది. వాహనదారులు రోడ్డునియమ నిబంధనలు పాటించక పోవడంతో సమస్య మరింత జఠిలమైంది. నిత్యం రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారిపోతున్నాయి. బస్టాండ్ ఆవరణంలో ట్రాఫిక్ సమస్య అధికమవుతుంది. ఆర్‌టిసి బస్టాండులో బస్సు బయటకు రావాలంటే చాలా సమయం పడుతుండటంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనదారులు ఇష్టానుసారంగా మితిమీరిన వేగంతో వెళుతుండటంతో ప్రమాదాలు చోటో చేసుకుంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. నాలుగు లైన్ల సిసి రోడ్ ప్రాంతంలో కూడా ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువుగా ఉందని, ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఉదయం వేళల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ సమస్యతో సమయానికి పాఠశాలకు వెళ్ళలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు, వాహనాలు తనిఖీ ఎన్ని చేపడుతున్న పరిస్థితి ఇలానే కొనసాగుతుందని ప్రజలు వాపోతున్నారు. పోలీసు అధికారులు పట్టణం ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.